## క్లుప్తంగా

### హనుమజ్జయంతి వేడుకలు నేడు

రామచంద్రాపురం(మంగళగిరి): మండలంలోని రామచంద్రాపురం కొలువైన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలోని శ్రీ ఆంజనేయస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ భక్త బృందం బుధవారం తెలిపింది. హనుమజ్జయంతిని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, హనుమాన్ చాలీసా పఠనం, నైవేద్య సమర్పణ జరగనున్నట్లు పేర్కొన్నారు.

### 169వ రోజు ఏసీసీ కార్మికుల రిలే దీక్షలు



మంగళగిరి: ప్రభుత్వం తమ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తాడేపల్లిలోని ఏసీసీ సిమెంట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 169వ రోజుకు చేరింది. దీక్షలను సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు, యూనియన్ నాయకుడు కోరపాటి స్టీఫెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ఎన్నికల సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.ఆశీర్వాదం, టి.నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, టి.దుర్గాభవాని, డి.మానిక్యాలరావు, ఇశ్రాయిలు, ఎం.గురవయ్య, సుబ్బారావు, కార్మికులు ఎం.శారద, ఎస్కే హిమాంబి, ఉదయగిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

### మండలంలో 2.8 మి.మీ. వర్షపాతం నమోదు

దుగ్గిరాల: దుగ్గిరాల మండలంలో మంగళవారం ఉదయం నుంచి కురిసిన వర్షానికి ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. మండలంలో 2.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని తాహసీల్దార్ కార్యాలయం అధికారులు వర్షమాపిని ద్వారా నమోదైన వివరాలను బుధవారం వెల్లడించారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



మంగళగిరి: పట్టణంలోని గౌతమ బుద్ధ రోడ్డులో మందాకిని బార్ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గమనించిన స్థానికులు బుధవారం పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రవీంద్ర నాయక్ వివరాలు సేకరించి మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్లు ఉంటాయని, మెరూన్ రంగు గళ్ల చొక్కా, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

### ఘనంగా రాజీవ్ గాంధీకి నివాళులు

మంగళగిరి: దేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశానికి సాంకేతికత తీసుకువచ్చిన మేటి నాయకుడని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. బుధవారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని రాజీవ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ సలీమ్ ,కృష్ణ చౌదరి, దర్శనపు శామ్యూల్, పఠాన్ సుభాని, షేక్ మున్ని, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రసన్నాంజనేయుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామికి హనుమజ్జయంతి సందర్భంగా బుధవారం విశేష పూజలు చేశారు. ఉదయాన్నే పంచామృతాలు, పండ్ల రసాలు, చందనంతో శ్రీ,పురుష, హనుమత్ సూక్తాలతో అర్చకులు ప్రసన్నమూర్తి, ఎస్.రాజభట్టర్, నిఖిల్ భరద్వాజ్‌లు అభిషేకాలు నిర్వహించారు. నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. అనంతరం యాగశాల వద్ద వేదపండితులు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గణపతి, సుదర్శన హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ద్విచక్రవాహనం చోరీ

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి సమీప ఇండియన్ బ్యాంక్ ఆవరణలో దిచక్ర వాహనం చోరీ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు సయ్యద్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్కింగ్‌లో రోజు లానే తమ ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేయగా బుధవారం తెల్లవారుజామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మరో ద్విచక్రవాహనంపై వచ్చారు. ఒకరు తన వాహనం తీసుకుని వెళ్లారని తెలిపారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు పేర్కొన్నారు.

# కాలువ ఇలా.. నీరు పారేదెలా!

- శిథిలావస్థకు చేరిన గుంటూరు ఛానల్‌పై వంతెన
- పట్టించుకోని ప్రభుత్వం.. ఆందోళనలో రైతులు, ప్రజలు



గుర్రపుడెక్కతో నిండిన కాలువ

మంగళగిరి: గుంటూరు, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు 5 మండలాలకు సాగు, తాగునీరు సరఫరా చేస్తున్న గుంటూరు ఛానల్ ఆధునీకరణను ప్రభుత్వం విస్మరించింది. దీంతో కాలువల మరమ్మతులు పట్టించుకోకపోవడంపై ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు ఛానల్ కాలువ ప్రకాశం బ్యారేజి నుంచి 47 కిలో మీటర్లతో ప్రవహించి సాగు, తాగు నీరు సరఫరా చేస్తోంది. గుంటూరు ఛానల్‌పై ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరడంతో పాటు ఛానల్ పూర్తిగా తూటికాడ, గుర్రపుడెక్కతో పెరిగి నీరు ముందుకు సాగడం లేదు. దీంతో సాగు నీరు ఎలా పారుతుందని రైతులు వాపోతున్నారు.

**ఆందోళనలో రైతులు..**

ప్రకాశం బ్యారేజి నుంచి మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, పెదకాకాని, గుంటూరు కార్పొరేషన్, వట్టిచెరుకూరు, ప్రత్తిపాడు మండలాలకు తాగునీటితో పాటు సాగు నీరు అందుతుంది. 47 కిలో మీటర్లలో 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయగా.. వరి, మిరప, పత్తి, ధాన్యాల పంటలు సాగు చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజి నుంచి 4 టీఎంసీల నీరు సరఫరా అవుతుండగా.. 3.2 టీఎంసీలు నీటిపారుదలకు, 1.42 టీఎంసీల నీటిని తాగునీటికి వినియోగిస్తున్నారు. దీని ద్వారా 5 మండలాల్లోని 33 గ్రామాల్లో 38 ట్యాంకులకు తాగు నీరు సరఫరా చేస్తున్నారు. గుంటూరు ఛానల్‌పై కాజ నంబూరు మధ్య కల వంతెన పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరింది. వంతెన ఎప్పుడు కూలుతుందోనని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు.



శిథిలావస్థలో కాజలోని గుంటూరు ఛానల్ వంతెన

**చర్యలు తీసుకోవాలి..**

ఛానల్ పూర్తిగా తూటికాడ పెరిగిపోయి నీరు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే అంతంత మాత్రం సరఫరా అవుతున్న నీరు వంతెనలు ఏమాత్రం కూలినా సాగు నీటికే కాక తాగునీటి కొరకు 5 మండలాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తూటికాడ మరింత పెరిగితే అంతంత మాత్రం పారుతున్న నీరు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదముందని.. వెంటనే ప్రభుత్వం గుంటూరు ఛానల్‌పై శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో నూతన వంతెనల నిర్మాణం చేయడంతో పాటు తూటికాడ తొలగించి నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

## జనరల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

**డీజీపీ కార్యాలయం ఎదుట కానిస్టేబుల్ అభ్యర్థుల ఆందోళన**



ఆందోళన చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

మంగళగిరి: కేసులు పరిష్కరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని కానిస్టేబుల్ అభ్యర్థులు డిమాండ్ చేశారు. బుధవారం నగర పరిధిలోని డీజీపీ కార్యాలయం ఎదుట కానిస్టేబుల్ అభ్యర్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. జనరల్ అభ్యర్థులకు న్యాయం చేసి పరీక్షలు నిర్వహించాలన్నారు. పోలీస్ శాఖలో ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియలో భాగంగా 2022లో నోటిఫికేషన్ జారీ చేశారు. భర్తీ ప్రక్రియలో భాగంగా 2023లో ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించారన్నారు. ప్రాథమిక రాత పరీక్షలో కనీస అర్హత మార్కులు సాధించలేని కొందరు హోంగార్డు అభ్యర్థులు ఎటువంటి అర్హత మార్కులనూ పేర్కొనలేదని వారు హైకోర్టును ఆశ్రయించారన్నారు. కేసు కోర్టులో ఉందని.. జూన్ 6వ తేదీన జరిగే మెయిన్స్‌ను కేసు పరిష్కరించిన అనంతరం నిర్వహించాలని అభ్యర్థులు కోరారు.


## విజేతలకు బహుమతులు ప్రదానం




బహుమతులు అందుకున్న వారితో సీఐ వీరానాయక్

పొన్నూరు: జ్ఞాపక శక్తితో పాటు, నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు చదరంగం ఆట దోహదపడుతుందని పట్టణ సీఐ ఎల్.వీరానాయక్ అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో బాలాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో అండర్-2 బాల బాలికలకు జిల్లా స్థాయి చదరంగం పోటీలు నిర్వహించారు. అనంతరం సభలో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీఐ వీరానాయక్ పాల్గొని విజేతలు కట్టిపోగు హర్షిత్, పునీత్ శ్రీ లక్ష్మీ కార్తికేయ, లక్ష్మీ చేతన, కావ్యలకు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న బాల, బాలికలు నలుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా చెస్ ప్రెసిడెంట్ రవీంద్రరాజు, డాక్టర్ శివకుమార్, డాక్టర్ కీర్తి, డాక్టర్ హిమబిందు, సూర్యనారాయణ పాల్గొన్నారు. గంగరాజు, షేక్.జానీబాషా, సీఎల్ శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం



చర్చి ముందు భాగంలో చేరిన వర్షం నీరు

ఫిరంగిపురం: మండలంలో బుధవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లోని కాలువలు నిండి మురుగు రోడ్లుపైకి చేరింది. ఫిరంగిపురంలోని ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న కాలువలు పూడుకుపోవడంతో మురుగు రోడ్డు మీదకి ప్రవహించింది. మురుగు నీరు సమీప దుకాణాల్లోకి చేరింది. దీంతో దుకాణ దారులు ఇబ్బందులు పడ్డారు. గతంలోనూ ఇలా మురుగు వచ్చిందని.. దీనిపై అధికారులకు తెలిపినా పట్టించుకున్న వారు లేరని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన అధిక వర్షానికి బాల ఏసు దేవాలయ ప్రాంగణం ముందు భాగం వర్షం నీరుతో నిండిపోయింది. సొలసబస్టాండు సెంటర్, రాజాపేట, క్రీస్తునగర్, అల్లంవారి పాలెం వంటి ప్రాంతాల్లో రోడ్లపైనే నీరు నిలిచిపోవడంతో వాహన దారులు ఇబ్బందులు పడ్డారు.

### బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును టీడీపీ నాయకులు బుధవారం అందజేశారు. తాడేపల్లి అమరారెడ్డినగర్‌కు చెందిన కొంకి మోహనరావు రోడ్డు ప్రమాదంలో జనవరి 17వ తేదిన మృతి చెందారు. పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో సభ్యత్వ బీమా చెక్కు రూ.5 లక్షలు మంజూరు కాగా నాయకులు మోహనరావు కుటుంబ సభ్యులకు అందజేశారు.

### శ్రీ మహంకాళీ గ్రామోత్సవం



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కంఠంరాజుకొండూరు గ్రామంలో కొలువైన శ్రీ మహంకాళీ అమ్మవారి గ్రామోత్సవం బుధవారం కనులపండువగా జరిగింది. 5వ రోజు చిలువూరు, తుమ్మపూడి, మంచికలపూడి, కంఠంరాజుకొండూరు గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

మంగళగిరి: కేంద్ర ప్రభుత్వం కార్మికులను ఇబ్బందికి గురిచేసేలా తీసుకువచ్చిన నాలుగు నూతన కార్మిక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ నాయకుడు చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. బుధవారం తాడేపల్లి మండలంలోని చిర్రావూరులో సీపీఐ చిర్రావూరు శాఖ మహాసభ నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంచర్ల కాశయ్య, జాలాది జాన్‌బాబు, ముసునూరు సుహాస్ తదితరులు పాల్గొన్నారు. చిర్రావూరు సీపీఐ నూతన శాఖ కమిటీ కార్యదర్శిగా కూరపాటి సింగయ్య, సభ్యులుగా మక్కుపాటి గోపి, మక్కపాటి వీరరాఘవరావు, కూరపాటి పరిశుద్ధరావులను ఎన్నుకున్నారు.

### భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

పొన్నూరు: అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. బుధవారం మండలంలోని పెదపాలెం గ్రామంలో ఆయన రీ సర్వేపై గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. రీ సర్వే ద్వారా రైతులకు సంబంధించిన భూ వివాదాలు నూరు శాతం పరిష్కారమవుతాయని అన్నారు. వల్లభరావుపాలెం గ్రామాన్ని రీ సర్వే పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గ్రామాన్ని 18 బ్లాక్‌లుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వల్లభరావుపాలెం గ్రామంలో పెదపాలెం, ఉప్పరపాలెం, సీతారామపురం గ్రామాలకు సంబంధించిన రైతులు కూడా భూములు ఉన్నాయని చెప్పారు. ఈ నెలలో రీ సర్వేని పూర్తి చేసే విధంగా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన శ్రీ ప్రపత్తాంజనేయుని బ్రహ్మోత్సవాలు



అలంకరణలో స్వామివారు

పొన్నూరు: మండల పరిధిలోని నండూరు గ్రామంలో కొలువైన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం విఘ్నేశ్వర పూజతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి అనుగ్రహం పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను హనుమత్ పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ పర్యవేక్షించారు. గురువారం హనుమజ్జయంతి పురస్కరించుకుని ఉదయం నిత్య అనుష్టానములు, స్వామికి విశేష ద్రవ్యాలతో అభిషేక అర్చనలు, శత సహస్ర నాగవల్లీ దళార్చన, హోమాలు, అనంతరం తీర్థప్రసాద వితరణ జరుగుతాయని శ్రీనివాస శర్మ తెలిపారు. హనుమజ్జన్మ కథ, సాయంత్రం లలితా విష్ణు సహస్రనామ పారాయణ, సహస్ర నామార్చన, హోమం, పంచహారతులు, వేదస్వస్తి ఉంటాయన్నారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

## గృహ నిర్మాణాలు వెంటనే చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న జియావుల్ హక్

పొన్నూరు: ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు పొజిషన్ సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. బుధవారం తమ కార్యాలయంలో హౌసింగ్‌కు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ షేక్.జానీబాష మాట్లాడుతూ.. మండలంలో 380 మంది లబ్ధిదారులలో ఇప్పటివరకు 147 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు వెంటనే అందజేయాలని తహసీల్దార్ ఆదేశించారు. వీఆర్వోలు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విధుల్లో అలసత్వం వీడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర రావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావు, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## మండలాల అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో పదవుల పండుగ కొనసాగుతుంది. ఇటీవల నియోజకవర్గ అనుబంధ విభాగాలు, మండల కమిటీలలో పార్టీకోసం కష్టపడి పనిచేసిన నాయకులకు స్థానం కల్పించి పదవులు భర్తీ చేయగా.. ప్రస్తుతం మండల కమిటీల నియామకం పూర్తి కావడంతో దాదాపు కీలక పదవులన్నీ భర్తీ అయ్యాయి. గ్రామ స్థాయి నుంచి కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి అందరితో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి పదువులను ఎంపిక చేయడం పట్ల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలాల వారీగా వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియమితులైన వారి వివరాలు ఇలా..

**తాడికొండ మండలం..**

యువజన విభాగం మండల అధ్యక్షుడిగా షేక్ అజీజ్, మహిళా విభాగం వలపర్ల కల్పన, రైతు విభాగం నంద్యాల సదానందరెడ్డి, బీసీ విభాగం దమ్మాటి మోహనరావు, ఎస్సీ సెల్ గుంటి రఘువరన్, ఎస్టీ సెల్ బొజ్జా శ్రీహరి, మైనార్టీ సెల్ షేక్ బాబావలి, విద్యార్థి విభాగం మల్లంపాటి చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ రాజ్ వింగ్ బొంతా శ్రీ కాంత్ యాదవ్, ఆర్టీఐ వింగ్ పరుచూరి సాయి కిరణ్, వాలంటీర్ వింగ్ పులివర్తి నరేంద్ర కుమార్, వాణిజ్య విభాగం కలవకొల్లు తిరుపతయ్య, వైఎస్సార్‌టీయూసీ షేక్ జుబేర్, అంగన్‌వాడీ వింగ్ కొదమల విజయలక్ష్మీ, కల్చరల్ వింగ్ పి.మోహన్ రెడ్డి, సోషల్ మీడియా వింగ్ కొప్పుల మహేష్, పబ్లిసిటీ వింగ్ ముచ్చు ఆనంద్‌లను ఎంపిక చేశారు.

**తుళ్లూరు మండలం..**

యువజన విభాగం అధ్యక్షుడిగా బెజ్జం రాంబాబు, మహిళా విభాగం నల్లూరి జ్యోతి, రైతు విభాగం వల్లంరెడ్డి సుధాకర్ రెడ్డి, బీసీ సెల్ గుమ్మా పూర్ణచంద్రరావు, ఎస్సీ సెల్ కోలేటి అనీల్, ఎస్టీ సెల్ ఇస్లామత్ శంకర్ నాయక్, మైనార్టీ సెల్ షేక్ జానీభాషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ తోకల రాఘవులు, విద్యార్థి విభాగం మేకల రవీంద్ర కుమార్, పంచాయతీరాజ్ వింగ్ పుట్టా నాగరాజు, ఆర్టీఐ వింగ్ కంచర్ల క్రాంతి కుమార్, వాలంటీర్స్ వింగ్ బండి ప్రసాద్, వాణిజ్య విభాగం పసుపులేటి అనీల్, వీవర్స్ వింగ్ పుజ్జల నాగేంద్ర బాబు, వైఎస్సార్‌టీయూసీ పుల్లా కృష్ణ, కల్చరల్ వింగ్ అమృతలూరి కనకారావు, సోషల్ మీడియా వింగ్ యశ్వంత్, బూత్ కమిటీ వింగ్ కాకి శ్రీ కాంత్, పబ్లిసిటీ వింగ్ కావూరి బుజ్జిలను ఎంపిక చేశారు.

**మేడికొండూరు మండలం..**

యువజన విభాగం అధ్యక్షుడిగా మానుకొండ రవి కిషోర్ రెడ్డి, మహిళా విభాగం కాసు విజయమ్మ, రైతు విభాగం అమాతి రాఘవరావు, బీసీ సెల్ మర్రి సతీష్, ఎస్సీ సెల్ మేరిగ శివ నాగేంద్రం, ఎస్టీ సెల్ కుంభా శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ షేక్ ఇమాం సాహెబ్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ బిల్లా లూర్థు రాజు, విద్యార్థి విభాగం షేక్ బ్యూలా సైదా, పంచాయతీరాజ్ వింగ్ షేక్ హాజీ, వాలంటీర్స్ వింగ్ షేక్ ఖాజా జానీ, గ్రీవెన్స్ సెల్ షేక్ షమ్మీ భాషా, వాణిజ్య విభాగం కొండెపోగు కన్నయ్య, వీవర్స్ వింగ్ ఆరుద్ర శ్రీనివాసరావు, వైఎస్సార్‌టీయూసీ కూరపాటి యోహాన్, లీగల్ సెల్ పిల్లి సుధీర్, కల్చరల్ వింగ్ దేవరకొండ సుబ్బారావు, సోషల్ మీడియా వింగ్ షేక్ జానీ భాషా, పబ్లిసిటీ వింగ్ బుర్రా సుబ్బారెడ్డిలను నియమించారు.

**ఫిరంగిపురం మండలం..**

యువజన విభాగం అధ్యక్షుడిగా సయ్యద్ సైదులు, మహిళా విభాగం ఎంర్రెడ్డి హేమలతా రెడ్డి, రైతు విభాగం కంభాల రామారావు, బీసీ సెల్ మర్రి గోపీ యాదవ్, ఎస్సీ సెల్ బొయలపల్లి సలోమాన్, ఎస్టీ సెల్ కుంభా తిరుపతయ్య, మైనార్టీ సెల్ షేక్ మస్తాన్ వలీ, విద్యార్థి విభాగం అల్లు శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ గుత్తికొండ ప్రతాప్ రెడ్డి, వాలంటీర్స్ వింగ్ వాసిపల్లి హర్షవర్ధన్‌రెడ్డి, గ్రీవెన్స్ సెల్ చిమటా వినోద్ కమార్, వాణిజ్య విభాగం అద్దెపల్లి శ్రీనివాసరావు, వీవర్స్ వింగ్ కాకుమాను ఫ్రాన్సిస్, వైఎస్సార్‌టీయూసీ డేగల బాబురావు, అంగన్‌వాడీ వింగ్ మండల సాంబ్రాజ్యం, సోషల్ మీడియా వింగ్ కంభాల సతీష్, ఐటీ వింగ్ ప్రతాప్ దేవ్ కురగంటి, డాక్టర్స్ వింగ్ కంభాల రాజు, బూత్ కమిటీ వింగ్ కొమ్మారెడ్డి ప్రవీణ్ కుమార్ రెడ్డి, పబ్లిసిటీ వింగ్ షేక్ మస్తాన్‌వలిలను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.



### అకాల వర్షం

చినరావూరు వెళ్లే ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికి జలమయం అవుతుంది. బుధవారం ఉదయం కొద్దిసేపు చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పార్కు ప్రక్క రోడ్డుతో పాటు రైల్వే స్టేషన్, తోటకు వెళ్లే రోడ్డులు జలమయం అయ్యాయి. దీనికి కారణం రహదారులు పల్లంలో ఉండడమే. ఈ రోడ్లపై చినరావూరులో నివసించే వారు కాకుండా జగ్గడిగుంటపాలెం, పెదరావూరు గ్రామ ప్రజలు కొందరు వెళుతుంటారు. వర్షం పడితే నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు ఎత్తు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. -తెనాలిఅర్బన్

### విగ్రహాల దిమ్మెకు మరమ్మతులు చేయాలి



నగర పరిధిలోని ఆత్మకూరు ప్రధాన ముఖద్వారంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాల వద్ద మరమ్మతులు నిర్వహించాలని ఆత్మకూరు ప్రజలు కోరారు. బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ అలీంబాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. విగ్రహాల దిమ్మె వద్ద టైల్స్ పాదయ్యాయని, ముఖ ద్వారం లైటింగ్ బోర్డు వెలగడం లేదని వెంటనే మరమ్మతులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కుర్రా రాంబాబు, శేషయ్య, జాలాది ప్రేమ్‌చంద్, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

– ఆత్మకూరు(మంగళగిరి)

### ఆక్రమణలను పరిశీలించిన తహసీల్దార్



తెనాలిరూరల్: పట్టణంలో ఆక్రమణలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పరిశీలించారు. స్థానిక పాండురంగ పేట, ఇందిరానగర్ కాలనీలో ఆయన బుధవారం పర్యటించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 17న పట్టణంలో పర్యటించిన నేపథ్యంలో ఆక్రమణల క్రమబద్ధీకరణ అంశాన్ని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రభుత్వానికి ఇబ్బందిలేని ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు తహసీల్దార్ బుధవారం పట్టణంలో పర్యటించి ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణకు అనుకూలమైన ప్రదేశాలను పరిశీలించారు. ఎంతకాలంగా ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు, వారి వద్ద ఉన్న ఆధారాలు, వారు ఆక్రమించిన ప్రాంతం ప్రభుత్వానికి భవిష్యత్తులో ఏదైనా అవసరమా, ఇబ్బందికరమా అనే అంశాలను పరిశీలించారు. ఆయన వెంట వీఆర్‌వోలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు, సిబ్బంది ఉన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలిరూరల్: ప్రమాదవశాత్తు జారి పడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హాఫ్‌పేట గ్రామానికి చెందిన కోటయ్య(44) 19వ తేదీ రాత్రి తన ఇంటి మిద్దెపై నిద్రపోతున్నారు. మధ్య రాత్రిలో కాలకృత్యాలకు లేచి దిగుతూ మెట్ల మీద నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ బుధవారం తెలిపారు